

ఉజ్వల భవితకు నవోదయం
జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. - 8లో



తప్పులు లేకుండా ఓటరు జాబితా
తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు బాధ్యతగా పనిచేయాలని డీఆర్‌ఓ ఆదేశించారు. - 8లో



పుష్ప పల్లకిలో పురుషోత్తముడు
తిరుమలలో బుధవారం శ్రీవారు ఉభయ దేవేరులతో పుష్ప పల్లకిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

విధుల్లో చేరని వీఆర్‌ఓలపై కఠిన చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : బదిలీ అయిన వీఆర్‌ఓలు వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో పనిచేస్తున్న వీఆర్‌వోలను ఇటీవల భారీ స్థాయిలో బదిలీలు నిర్వహించిన విషయం విధితమే. ఈ బదిలీలు జరిగి దాదాపు నెల రోజులు అవుతోంది. అయితే పలు ప్రాంతాల్లో బదిలీ అయిన వీఆర్‌ఓలు ఇప్పటికీ కొత్త స్థానాల్లో విధుల్లో చేరని పరిస్థితి ఉంది. ఈ విషయం పై ఉన్నతాధికారులకు తహసీల్దార్లు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన డీఆర్‌ఓ మోహన్ కుమార్ బదిలీ అయిన వీఆర్‌ఓలు వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని బుధవారం ఆదేశించారు. రెండు రోజుల్లో కొత్త స్థానాల్లో తప్పనిసరిగా చేరాలని, లేని పక్షంలో కఠిన చర్యలుంటాయని డీఆర్‌వో హెచ్చరించారు.

వైద్య బిల్లుల చెల్లింపులో జాప్యం తగదు

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల వైద్య ఖర్చుల బిల్లుల చెల్లింపులో జాప్యం వహించడం సరికాదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ గుర్తింపు లేని ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేసుకున్న ఉద్యోగులు, టీచర్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆస్పత్రుల్లో ముందస్తుగా ఖర్చులు పెట్టి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిపారు. ఆర్థిక శాఖ బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. వెంటనే రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తూతూ మంత్రంగా తనిఖీ



శిక్షణా కేంద్రం వద్ద ఎస్‌ఐఎంఏటీ డైరెక్టర్ మస్తానయ్య

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని మిట్టూరులోని అరుణాచల జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలకు నిపుణ్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ జారీచేసిన నిబంధనలను ఏ మాత్రం పాటించకుండా మమ అనిపించేస్తున్నారు. ఈ శిక్షణ ప్రారంభమైన మొదటి రోజే హాజరైన ప్రైమరీ హెచ్‌ఎంలకు భోజనం పెట్టకపోవడంతో ధర్నా చేయాల్సి వచ్చింది. దీంతో జిల్లా సమగ్రశిక్ష శాఖ అధికారుల అలసత్వ ధోరణిపై పలు ఫిర్యాదులు రాష్ట్ర అధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ మేరకు ఎస్‌ఐఎంఏటీ (స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రెనింగ్) శాఖ డైరెక్టర్ మస్తానయ్య బుధవారం ఆకస్మికంగా జిల్లా పర్యటనకు విచ్చేశారు. అరుణాచల జూనియర్ కళాశాల శిక్షణా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ కేంద్రంలోని ఐదు గదులలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఆయన ఐదు నిమిషాలు సైతం కేంద్రంలో ఉండకుండా ఏదో వచ్చామా....వెళ్లామా అనే ధోరణిలో పరిశీలించి వెళ్లిపోయారు. ఈ అంశం శిక్షణా కేంద్రంలో సర్వత్రా చర్చగా మారింది. ఇలాంటి మొక్కుబడి తనిఖీలతో ఎవరికి ఉపయోగమని సంఘం నేతలు పెదవి విరుస్తున్నారు.

ఆధార్ అప్‌డేట్ లేకపోతే..ప్రస్తుత పరిస్థితుల్లో రేషన్ నుంచి పింఛన్ వరకు ఏ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులు ఆధార్ సమస్యలతో సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ఆధార్ సమస్యలను పరిష్కరించాల్సిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఎంత మంది సంక్షేమ పథకాలకు దూరమైతే అంత మంచిదనే ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంక్షేమ పథకాలకు దూరమైన లబ్ధిదారులకు ఎవరు న్యాయం చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో సమస్యగా మారిన ఆధార్ సమస్యపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆధార్ అవస్థలు



- పథకాలకు దూరమవుతున్న లబ్ధిదారులు
- అవగాహన లేక నష్టపోతున్న ప్రజలు
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- లబ్ధిదారులకు న్యాయం జరిగేదెప్పుడు?

చిత్తూరు కలెక్టరేట్ : అర్హత ఉన్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం మొదటి, రెండు విడతల్లో సాయం అందని దుస్థితి. ఇదేమిటని ఆరాతీస్తే ఆధార్ అప్‌డేట్ (ఈకేవైసీ) జరగలేదనే కారణం తెలియవచ్చింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని ఆధార్ కేంద్రాలు, సచివాలయాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. మరికొంత మంది సచివాలయాలు, ఆధార్ కేంద్రాల వద్దకు తిరిగి ఆధార్ అప్‌డేట్ అవ్వక దూరమైన పరిస్థితి. ఇదే విధంగా పలు సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికీ వేల మంది లబ్ధిదారులు ఆధార్ సమస్యతో నష్టపోతున్నారు. ఆధార్ సమస్యను పరిష్కరించాల్సిన జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ కోసం నిరీక్షిస్తున్న ప్రజలు (ఫైల్)

అప్‌డేట్ చేయించకపోవడం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరిగా మారింది. కొత్తగా ఆధార్ పొందడంతో పాటు ఎప్పుడో పొందిన ఆధార్‌ను అప్‌డేట్ (ఈకేవైసీ) చేయించుకోకపోవడం వల్ల లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. దీంతో అర్హత ఉన్నా సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారు. మ్యాన్‌డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్స్ (ఎంబీయూ) చేయించుకోని వారు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా లక్షల మంది ఉన్నారు. వారందరికీ ఆధార్‌కార్డు ఉన్నప్పటికీ అప్‌డేట్ చేయించుకోకపోవడంతో సంక్షేమ పథకాలు పొందలేని దుస్థితి ఏర్పడుతోంది.

అవగాహన కల్పించక.. శిబిరాల నిర్వహణ తెలియక

జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఆ శిబిరాలు ఎప్పుడు నిర్వహిస్తారో...ఎప్పుడు ముగిస్తారో అనే వివరాలు ఎవ్వరికీ తెలియని దుస్థితి. ఆధార్ శిబిరాల్లో ఏ సేవలు పొందవచ్చనే అంశాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారు. పిల్లలైతే తల్లి లేదా తండ్రిని తీసుకుని, పెద్దలైతే స్వయంగా ఆధార్‌తో వెళ్లి వేలిముద్రలు వేస్తే అప్‌డేట్ ప్రక్రియ పూర్తవుతుంది. దీనికి ఎటువంటి రుసుం వసూలు చేయరు. కొత్తగా ఆధార్ పొందేవారి నుంచి మాత్రం నిర్ణీత రుసుం వసూలు చేస్తారు. తదితర అంశాలను, ఆధార్ శిబిరాల వివరాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడితే అర్హులకు న్యాయం జరుగుతుంది.

సమస్యలు ఇలా..

- చిత్తూరుకు చెందిన బాలుడు అజిత్‌ను ఒకటో తరగతిలో చేర్చేందుకు వారి తల్లిదండ్రులు వెళ్లారు. ఆధార్ లేకపోవడంతో చైల్డ్ ఇన్ఫోలో వివరాలు నమోదు కాలేదు. దీంతో తల్లికి వందనం లబ్ధిదారుల జాబితాలో ఆ విద్యార్థి పేరు చేరలేదు. ఇదే సమస్యతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వేల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులుగా జూన్ 30వ తేదీ లోగా ఆధార్ అప్‌డేట్ చేయించుకున్న రైతులనే ఎంపిక చేశారు. ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్ లేక వేల మంది రైతులు అర్హుల జాబితాలో చేరలేక నష్టపోయారు. ఫలితంగా నష్టపోయిన రైతులు నిత్యం రైతు సేవా కేంద్రాలు, సచివాలయాలు, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.
- జిల్లా వ్యాప్తంగా 1947 ప్రాథమిక, 158 ప్రాథమికోన్నత, 153 ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు పొందిన వారిలో దాదాపు 3 వేల మంది విద్యార్థులు పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రిని పొందలేకపోయారు.
- జిల్లాలోని వసతి గృహాల్లో అడ్మిషన్లు పొందిన దాదాపు 2 వేల మంది విద్యార్థులు ఆధార్ సమస్యతో అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో ఆధార్ అప్‌డేట్ సమస్యల వివరాలు ఇలా..

5 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులు	21,456
15 ఏళ్లకు పైబడిన వారు	1,45,258
తల్లికి వందనం పథకంలో నష్టపోయిన విద్యార్థులు దాదాపు	3 వేల మంది
ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన విద్యార్థులు	1,326 మంది
ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన పెద్దలు	4,879 మంది

సంక్షేమ పథకాలకు దూరం



జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆధార్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంక్షేమ పథకాలకు ఆధార్ ముఖ్యం చేయడంతో సమస్యలు ఎక్కువయ్యాయి. అవగాహన ఉన్న ప్రజలేమో కేంద్రాలకు వెళ్లి సమస్యను పరిష్కరించుకుంటున్నారు. అవగాహన లేని వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అదే విధంగా చాలా మంది పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఆధార్ అప్‌డేట్ అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి ప్రజలకు న్యాయం చేయాలి.

– వాడ గంగరాజు, సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు, చిత్తూరు జిల్లా

కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం



ర్యాలీలో పాల్గొన్న జడ్జి, న్యాయవాదులు, ఉద్యోగులు

చిత్తూరు లీగల్ : కోర్టుల్లో పెండింగ్ ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని అవగాహన కల్పిస్తూ బుధవారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకమని.. దీన్ని ప్రతి ఒక్క కక్షిదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 73,020 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,609 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.19 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- అరెస్టు చేసిన ప్రతి కార్యకర్తకు అండగా జగనన్న
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : అక్రమ కేసులకు, కూటమి నాయకుల తాటాకు చప్పుళ్లకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నియోజకవర్గ నాయకులతో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి జగనన్నతో మాట్లాడుతూ.. బంగారు పాళ్యం మార్కెట్ యార్డులో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించారని జగనన్నకు వివరించినట్లు తెలిపారు. కూటమి నాయకులు కక్ష కట్టి కేసులు పెట్టిన ప్రతి కార్యకర్తకూ జగనన్న అండగా ఉంటారని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని చెప్పారన్నారు. అక్రమ కేసులో అరెస్టు అయిన వారికి న్యాయ సలహా ద్వారా రక్షణ కల్పించడానికి కట్టుబడి ఉన్నట్లు జగనన్న సూచించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పాలసముద్రం మండలం నుంచి కూటమి నాయకులు యథేచ్ఛగా దోచుకుంటున్న గ్రావెల్ మాఫియాపై జగన్ మోహన్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. వారి వెంట ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి పలువురు ఉన్నారు.

మాతా శిశుసంరక్షణకు ప్రాధాన్యం

- పలు శాఖల అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఆసుపత్రుల్లో మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ..ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు బాధ్యతాయుతంగా పనిచేసేలా మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని తెలిపారు. గర్భిణుల నమోదులో అలసత్వం చోటు చేసుకోకుండా అంగన్‌వాడీ కేంద్రాలల్లోని రిజిస్టర్‌తో సరిచూసుకోవాలన్నారు. సమీక్షలో డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు 'ఉల్లాస్'

జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ పథకంలో అక్షర ఆంధ్రాను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఈ పథకం అమలు పై నిర్వహించిన సమీక్షలో ఆయన పలు అంశాలు వెల్లడించారు. జిల్లాలో దాదాపు 40 వేల నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. 2029 నాటికి 100 శాతం అక్షరాస్యత దిశగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడేల్, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు.. సాగు ఖర్చులు తగ్గించేందుకు చేపట్టే భూసార పరీక్షలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. దాదాపు ఏడాదిగా ఒక్కరూపాయీ విదల్చకుండా రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది. మట్టి నమూనాలు సేకరించినా ఫలితాలు ఇవ్వకుండా వేధిస్తోంది. నేల స్వభావం తెలియక అధిక పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎలాంటి రసాయన ఎరువులు వాడాలో కూడా చెప్పేవారు కరువవడం విమర్శలకు తావిస్తోంది.

రైతుకు పరీక్షే!

- ఖరీఫ్ మొదలైనా ఊసేలేని భూసార పరీక్షలు
- ఇష్టారాజ్యంగా మట్టి నమూనాల సేకరణ
- సిద్ధం కాని పరీక్ష కేంద్రం
- అవస్థల్లో అన్నదాతలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భూసార పరీక్షలతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ ఏడాది జిల్లాలో 27 వేల భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇంతవరకు మట్టి నమూనాల సేకరణ, రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం మినహా ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

రైతుల పాలిట శాపం

భూసార పరీక్షల్లో ఉదజని సూచిక, స్థూల పోషకాలైన భాస్వరం, నత్రజని, పోటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలైన జింక్, కాల్షియం, క్లోరిన్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, సల్ఫర్, కాపర్, మాలిబ్డినం తదితర 15 పరీక్షలు నిర్వహిస్తారు. ఉద్దేశం మంచిదే అయినా భూసార పరీక్షల నిర్వహణలో చిత్తశుద్ధి లోపించడం రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లాలో 502 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో దానినుంచి 55 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. ఇలా 2,796 మట్టి నమూనాలు సేకరించేలా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు 26,948 నమూనాలను సేకరించినట్లు అధికారులు లెక్కలుగట్టారు.

సేకరించిన నమూనాలు.. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చే స్తారు. తర్వాత మట్టి నమూనాలను సంబంధిత భూసార పరీక్ష కేంద్రాలకు తరలిస్తారు. కానీ ఇంతవరకు భూసార పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఒక్క రూపాయీ విదల్చలేదు. కెమికల్స్ లేవు. ఇన్ని సమస్యల మధ్య భూసార పరీక్ష ఫలితాలు ఎప్పుడు ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

చిత్తూరులో మాత్రమే...

చిత్తూరు నగరంలోని మార్కెట్ యార్డులో ఉన్న భూసార పరీక్షల కేంద్రానికి మాత్రమే పరీక్షలు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు న్నాయి. కుప్పంలోని కేంద్రానికి అనుమతులు ఇవ్వలేదు. అయితే చిత్తూరులోని భవనం పాడుబడింది. వీటి మరమ్మతులకు ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసింది. గత నాలుగు నెలలకు క్రితం నిధులు కేటాయించినా ఇంతవరకు ఆ భవనం భూసార పరీక్షలకు సిద్ధం కాలేదు. వచ్చే నెలకు పూర్తి కావొచ్చన్ని అధికారులు భావిస్తున్నారు.

ఇష్టారాజ్యం

మట్టి నమూనాల సేకరణకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఆ ప్రకారమే సేకరించాల్సి ఉంది. గ్యాప్ పొలంబడి నిర్వహించే ప్రాంతాలు, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు, ఆయిల్ సీడ్స్ ప్రదర్శనా క్షేత్రాలు.. తదితర ప్రాంతాల్లోనే మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. 2024–25లో మార్గదర్శకాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా సేకరించి మమ అనిపించారు. దీంతో భూసార పరీక్షలకు ఎలాంటి ప్రాధాన్యత లేకుండా పోయింది. ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే మట్టి నమూనాల సేకరణ ప్రహసనంగా మారింది. మార్గదర్శకాలకు విరుద్ధంగా మట్టినమూనాలు సేకరిస్తుండడంతో భూసార పరీక్షల్లో పారదర్శకత లేకుండా పోయింది.

అస్తవ్యస్తం

భూసార పరీక్షల్లో నాణ్యత ఉండాలంటే తగిన మోతాదులో రసాయనాలు వినియోగించాలి. ఇందుకు ఈ ఏడాది ఒక్క రూపాయీ విడుదల కాలేదు. రసాయనాలు లేవు. గతంలో 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ భూసార పరీక్షలంటూ హంగామా చేసిందే తప్ప.. ఫలితాలను రైతులకు ఇవ్వలేదు. ఇదే పరిస్థితి 2024–25లో కూడా పునరావృతమైంది. 2025–26లో భూసార పరీక్షల నిర్వహణ మరింత అస్తవ్యస్తంగా తయారైందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మరమ్మతులు జరుగుతున్నాయి



ఒక్కో రైతు సేవా కేంద్రం పరిధిలో 55 మట్టి నమూనాలు సేకరించే విధంగా లక్ష్యాలు ఇచ్చాం. ప్రస్తుతం రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆన్‌లై న్ చేసిన తర్వాత మట్టి నమూనాలు ల్యాబ్‌కు వస్తాయి. ల్యాబ్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయిన వెంటనే పరీక్షలు ప్రారంభమవుతాయి.

–మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు

బోయకొండ కిటకిట

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ తల్లి దీవెనల కోసం భక్తులు బోయకొండకు బుధవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. బోయకొండ ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్క రోజే సుమారు 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

క్లుప్తంగా

జర్నలిస్టు హెల్త్ స్కీంను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్


సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గుర్తింపు పొందిన జర్నలిస్టులు హెల్త్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అక్రిడియేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకంలో ప్రీమియం రూ.1250ని చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. చెల్లించిన అనంతరం జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, రెన్యూవల్ చేయించుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. జర్నలిస్టులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) తరహాలో నగదు రహితంగా వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 6 వినతులు


సమస్యలు వింటున్న డీఈలు ఆనంద్, ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో వివిధ సమస్యలపై మొత్తం 6 వినతులు వచ్చినట్లు డీఈలు ఆనంద్, ప్రసాద్ తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించినట్లు వెల్లడించారు.

యువకుడి బలవన్మరణం

పుంగనూరు : చెడు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు ఇంట్లోనే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని ఈడిగపల్లెలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాధమ్మ కుమారుడు అనిల్‌కుమార్(25) జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తూ చెడు అలవాట్లకు బానిసయ్యాడు. అనిల్‌కుమార్‌తో భార్యకు విభేదాలు ఏర్పడి ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీనిపై తల్లి అనిల్‌కుమార్‌ను మందలించడంతో మంగళవారం పనికోసం వెళ్లి తన ఇంటిలోనే ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని ఉదయం గుర్తించారు. ఈ మేరకు తల్లి ..పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఉజ్వల భవితకు 'నవోదయం'

- దరఖాస్తులకు అవకాశం
- ఈనెల 29న చివరి గడువు
- గ్రామీణ విద్యార్థులకు వరం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



రిజర్వేషన్లు ఇలా..	
ఎస్సీలకు	15 శాతం
ఎస్టీలకు	7.5
దివ్యాంగులకు	3
బాలికలకు	33శాతం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉచిత భోజనం, వసతితో అత్యుత్తమ విద్యనందిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లె వద్ద జవహర్ నవోదయ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధిస్తే 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా విద్యాభ్యాసం కొనసాగించవచ్చు. విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య చాలా కీలకమైంది. పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నవీన విద్యను అందించాలన్న ఉద్దేశంతో జవహర్ నవోదయ విద్యాలయాలు నెలకొల్పారు. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 29వ తేదీతో గడువు ముగియనుంది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిల్లా సమాచారం	
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	1,947
ప్రాథమికోన్నత పాఠశాలలు	158
ప్రాథమిక పాఠశాల విద్యార్థులు	51,952
ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు	10,200
దరఖాస్తుకు గడువు	జూలై 29
ప్రవేశ పరీక్ష తేదీ	డిసెంబర్ 13

పరీక్ష ఇలా..

పరీక్ష రకం	ప్రశ్నల సంఖ్య	మార్కులు	సమయం (నిమిషాలు)
మేధాశక్తి	40	50	60
అంకగణితం	20	25	30
భాషాపరీక్ష	20	25	30

దరఖాస్తులు ఇలా...

జవహర్ నవోదయ విద్యాలయాలకు విద్యార్థులు www.cbseitems.rcl.gov.in/nvs అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారై ఉండాలి.

- ప్రవేశ పరీక్ష రాయబోయే విద్యార్థి ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన అడ్మిషన్లను పరిగణలోకి తీసుకుంటారు.

అధునాతన సౌకర్యాలు

- సువిశాలమైన పాఠశాల ప్రాంగణం
- శాశ్వత తరగతి గదులు, డిజిటల్ పాఠాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- అధునాతన కంప్యూటర్ ల్యాబ్
- బాల, బాలికలకు విడివిడిగా వసతి గృహాలు
- ఇంటి తరహా భోజనం, పరిశుద్ధమైన తాగు నీరు
- ఉదయం యోగా, వ్యాయామం సాధన
- కూచిపూడి, యోగా, చిత్రలేఖనం, సంగీతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, పలు క్రీడల్లో శిక్షణ ఇస్తారు.
- పాఠ్యాంశాలతో పాటూ విజ్ఞానాన్ని పెంపొందించే ఎన్నో పుస్తకాలతో కూడిన గ్రంథాలయం
- పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణ

త్వరగా దరఖాస్తు చేసుకోండి



ఈనెల 29వ తేదీన చివరి రోజు కావడంతో ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు, సమస్యలు ఉన్నట్లయితే డీఈవో కార్యాలయంలో ఉన్న పరీక్షల విభాగంలో సంప్రదించవచ్చు.

– వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు జిల్లా

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు



నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే నిర్వహించడం జరుగుతుంది. ఎలాంటి సిఫార్సులకు తావుండదు. తల్లిదండ్రులు, విద్యార్థులు అపోహలకు లోనవ్వకుండా పూర్తి అవగాహన, అప్రమత్తతతో ఉండాలి. పరీక్షా విధానం, ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా ఉంటుంది. ప్రవేశం పొందే విద్యార్థులు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఎలాంటి ఖర్చు లేకుండా విద్యాభ్యాసం సాగించవచ్చు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విద్యార్థులు గడువు తేదీలోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గీత, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయ, వలసపల్లి అన్నమయ్య జిల్లా

'కాణిపాకం'ను అభివృద్ధి చేయండి


ఈవోను సన్మానిస్తున్న దృశ్యం

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంను మరింత అభివృద్ధి పరచాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ – శరద్ చంద్ర పవార్ అధికార ప్రతినిధి, యువ భారత్ చైర్మన్ వైద్య ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు సన్మానం చేశారు. కాణిపాకం అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా దేవస్థాన అధికారులు అడుగులు వేయాలని ఈవోను కోరారు.

రేపటితో ముగియనున్న వెబ్ ఆప్షన్లు

తిరుపతి సిటీ : ఏపీఈఏపీసెట్–2025కు సంబంధించి ఇంజినీరింగ్ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగియనుంది. ఈనెల 13వ తేదీ నుంచి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇప్పటికే జిల్లాలో సుమారు 19 వేల మందికిపైగా వెబ్‌ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేశారు. మరో రోజు మాత్రమే వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఉండడంతో విద్యార్థులు అప్రమత్తం కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈనెల 19వ తేదీన ఒక రోజు మాత్రమే వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉండనుంది. 22 వతేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి కానుంది. అలాగే ఐసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈనెల 21వ తేదీవరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఇచ్చిన అధికారులు, 22న వెబ్ ఆప్షన్ల మార్పు, 25న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా


హాజరైన అధికారులు

చిత్తూరు అర్బన్ : తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు బాధ్యతగా పనిచేయాలని డీఆర్‌ఓ మోహన్ కుమార్ ఆదేశించారు. ఇందుకోసం బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ఓటర్ల జాబితా రూపకల్పన, మార్పులు చేర్పులపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.,. బుధవారం చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో చేపట్టిన బీఎల్వోల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్వోల పాత్ర కీలకమని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని కోరారు. ఓటర్ల జాబితా కోసం ఇంటింటి పరిశీలనను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓటర్ల జాబితాలో చిరునామా, ఇతర వివరాల మార్పులు చేర్పులకు సంబంధించి నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. సర్వేలో పారదర్శకంగా వ్యవహరించాలని, పొరబాట్లు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఏఎస్‌ఓ సౌందర్ రాజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌డీఓ శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, రూరల్, అర్బన్ తహసీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు హిమగిరి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆధార్ నమోదు


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆధార్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికీ ఆధార్ కార్డు తప్పనిసరన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆధార్ అనుసంధానంగా ఉంటుందని వెల్లడించారు. ఇందులో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కుప్పం, నగరి నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించాలని సూచించారు. విద్య, వైద్య, ఐసీడీఎస్, గ్రామ, వార్డు సచివాలయ అధికారులు సమన్వయంతో ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయిలో 58 శాతం

ఆధార్ నమోదుకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో జిల్లా 58 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. సెప్టెంబర్ నెలాఖరుకు ఆధార్ నమోదు 100 శాతం పూర్తి కావాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలోనే జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 226 ఆధార్ కేంద్రాలున్నట్లు తెలిపారు. అందులో 117 గ్రామ, వార్డు సచివాలయాలు, 7 ఈ–సేవా కేంద్రాలు, 9 పోస్టాఫీసులు, 9 బీఎస్ఎన్ఎల్ ఆఫీసులు, 14 బ్యాంక్‌లు, 34 వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయల ద్వారా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలో 0–5 ఏళ్ల పిల్లల జనాభా దాదాపు 1,53,047 ఉండగా, ఈ ఏడాది జూన్ 5 వ తేదీ నాటికి 88,179 మందికి ఆధార్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, డీఎల్‌డీఓ రవి కుమార్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఈఓ వరలక్ష్మి, డీఎంహెచ్‌ఓ సుధారాణి పాల్గొన్నారు.

పుష్పపల్లకీలో పురుషోత్తముడు



తిరుమల వేంకటేశ్వర స్వామి దేవేరులతో కలసి బుధవారం సాయంత్రం పుష్పపల్లకీలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం ఉదయం ఆణివార ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పల్లకిపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

– తిరుమల

నేడు ఐఐటీలో ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం


తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ప్రారంభం కానున్న కామన్ ఇంకుబేషన్ సెంటర్

ఏర్పేడు: మండల కేంద్రంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో గురువారం రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటైన కామన్ ఇంకుబేషన్ సెంటర్‌ను కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్, రాష్ట్రమంత్రి టీజీ భరత్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ తెలిపారు. తొలుత వీరు పర్యటన ఖరారైనప్పటికీ అనివార్య కారణాలతో ఢిల్లీ నుంచే కేంద్రమంత్రి వర్చువల్ విధానంలో ఈ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద దేశవ్యాప్తంగా రూ.2,059 కోట్ల వ్యయంతో 76 కేంద్రాల్లో ఈ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగానే తిరుపతిలో ఈ యూనిట్‌ను ఐఐటీ ప్రాంగణంలో ప్రారంభించనున్నారు. ఇక్కడ పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ ద్వారా రోజుకు 20 టన్నుల మేరకు మామిడి, టమాట, అంజీర్, జామ తదితర పండ్లను ప్రాసెసింగ్ చేసి జ్యూస్, జామ్, పికిల్స్ వంటి ఉత్పత్తులు స్వస్త బ్రాండ్‌తో మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకురానున్నారు.

నీతి పద్యాలు దారి చూపే నేస్తాలు


విద్యార్థులకు అందజేసిన నీతి పద్యాల పుస్తకాలు


చిత్తూరు కలెక్టరేట్ : నీతిపద్యాలు దారి చూపే నేస్తాల వంటివని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు అన్నారు. బుధవారం నగరంలోని జైహింద్ పాఠశాలలో విద్యార్థులకు నీతి పద్యాల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నీతిపద్యాలు నేర్చుకుంటే వ్యక్తిత్వం పెరుగుతుందన్నారు. ఆగస్టు 29వ తేదీన తెలుగుభాషా దినోత్సవంలోపు వంద నీతి పద్యాలు నేర్చుకునే విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం ప్రకాష్, టీచర్లు చంద్రశేఖర్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ


బాధితురాలు భాగ్యలక్ష్మి

పుంగనూరు : పట్టణంలోని కట్టకిందపాళెం వద్ద ఓ వృద్ధురాలి మెడలో గొలుసును ఇద్దరు యువకులు అపహరించారు. వివరాలు.. బుధవారం ఉదయం సుమారు 7 గంటలకు భాగ్యలక్ష్మి(70) అనే వృద్ధురాలి మెడలో నుంచి 24 గ్రాముల బొట్టుచైనును ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి లాక్కెళ్లారు. దీంతో ఆమెకు కిందపడి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే సీఐ సుబ్బరాయుడు ఘటనాస్థలానికి వెళ్లి వృద్ధురాలిని విచారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం


ఘాట్‌రోడ్డులో చెట్టును ఢీ కొన్న కారు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని బెంగళూరుకు చెందిన భక్తులు కారులో అధికవేగంగా వెళుతుండగా వినాయక స్వామి ఆలయం వద్ద కారు అదుపుతప్పి చెట్టు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా.. అందులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే విషయం తెలుసుకున్న ఘాట్ రోడ్డు సిబ్బంది వారిని తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు.

రైల్వే తత్కాల్ టికెట్ నిబంధనలు మార్పు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: రైల్వేశాఖ తత్కాల్ టికెట్ బుకింగ్ నిబంధనలు మార్పు చేసింది. సోమవారం నుంచే టికెట్ బుకింగ్స్ నిబంధనల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఐఆర్‌సీటీ వెబ్‌సైట్, యాప్‌లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకునే సమయంలో ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి అని రైల్వే అధికార యంత్రాంగం పేర్కొంది. తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ఆధార్ ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. రైల్వేశాఖ టికెట్ బుకింగ్‌లో పారదర్శకతను తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. తత్కాల్ టికెట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే దాదాపు అన్ని టికెట్లు నిమిషాల్లోనే బుక్ అవుతుంటాయి. ఈ నేపథ్యంలో తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలో జరిగే మోసాలను ఆపేందుకు రైల్వేశాఖ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టింది.

దళారీ వ్యవస్థకు చెక్

కొందరు దళారులు, ఏజెంట్లు టికెట్లన్నింటినీ సాఫ్ట్‌వేర్, తప్పుడు మార్గాల్లో బుక్ చేస్తుండడంతో మిగిలిన ప్రయాణికులకు టికెట్లు దొరక్క ఇబ్బందులుపడుతున్న విషయాన్ని రైల్వేశాఖ గుర్తించింది. ప్రయాణికులు మాత్రమే టికెట్‌ను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకునేవారు ఏసీ క్లాస్ తత్కాల్ బుకింగ్ సమయం ఉదయం 10 గంటలు కాగా నాన్ ఏసీ ప్రయాణానికి 11 గంటలు సమయం కేటాయించారు. కొత్త నిబంధనల ప్రకారం ఏజెంట్లు ఏసీ–నాన్ ఏసీ టికెట్లను తత్కాల్ టికెట్ బుకింగ్ మొదలైన అరగంట తర్వాత మాత్రమే బుక్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అంటే ఏజెంట్లు ఇకపై ఏసీ టికెట్లను 10.30 గంటలకు, నాన్ ఏసీ టికెట్లు 11.30 గంటలకు బుకింగ్స్ ఓపెన్ అవుతాయి. అదే సమయంలో ప్రయాణికులు రైల్వే స్టేషన్ కౌంటర్ నుంచి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకున్నా ఆధార్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సమయంలో ప్రయాణికుడి మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేయాలి. తద్వారా ఓటీపీ వస్తుంది. మీరు వేరొకరికి టికెట్ బుక్ చేయాలనుకుంటే ఆ ప్రయాణికుడి ఆధార్ నంబర్‌తో పాటు ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది.

హెల్ప్‌లైన్ సేవలు

ఎవరికైనా ఆధార్ కార్డ్ ఉండి, టికెట్ బుకింగ్ సమయంలో ఓటీపీ రాకపోతే ఆ నంబర్ ఆధార్‌తో లింక్ చేయకపోతే ఐఆర్‌సీటీసీ హెల్ప్‌లైన్ (139)కి కాల్ చేయవచ్చు. దీంతో పాటు ఆధార్ నమోదుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆధార్ హెల్ప్‌లైన్ (1947) ని సంప్రదించవచ్చు. ప్రయాణికుడికి ఆధార్ కార్డు లేకపోతే, తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవడం కష్టంగా మారనుంది.